ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025
అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తున్నాం

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - ఉరవకొండ

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేస్తున్నామనిరాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని విడపనకల్ మండలం హవళిగి, పాల్తూరు తదితర గ్రామాల్లో రూ.7.40 కోట్ల అంచనాతో ప్రతి ఇంటికీ త్రాగునీటి సౌకర్యము కల్పించే నూతన పైప్ లైన్‌ను బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో అభివృద్ధి ఎప్పుడు చేసినా కూడా తన ఆధ్వర్యంలోనే జరిగిందన్నారు.అనంతపురం నుంచి బళ్లారి రోడ్ అయినా, ఉరవకొండలో జూనియర్ కాలేజీ కట్టినా,ఆసుపత్రి కట్టినా మహిళా జూనియర్ కాలేజ్, గ్రామాల్లో పాఠశాలల భవనాలు కట్టినా,జిబిసి కాలువలకు సిమెంట్ లైనింగ్ కూడా హయాంలోనే జరిగిందన్నారు. గత ఐదేళ్లలో గంప మన్ను కాలువలో తీయలేదన్నారు. హవళిగి గ్రామంలో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే వారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గ్రామానికి పైప్ లైన్ వేయడం జరిగిందని, మరో 10 ఏళ్ల తాగునీటికి ఇబ్బంది లేదని అన్నారు. ఉరవకొండ తనకు రాజకీయంగా జన్మనిచ్చిందని,ఈ స్థాయికి తీసుకు వచ్చిందని, గెలిచినా, ఓడినా కూడా 30 ఏళ్లుగా మిమ్మల్ని విడిచిపెట్టలేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అడక్కపోయినా నీటి పథకాన్ని మంజూరు చేశామని, గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, అన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటి పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రం అప్పుల ఇబ్బందుల్లో ఉందని, ఉరవకొండ నియోజకవర్గమే కాదు, రాష్ట్రం మొత్తం కూడా నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. హామీ ఇచ్చిన పథకాలను అమలు చేస్తూ వస్తున్నామని చెప్పారు. అంతర్రాష్ట్ర సర్వీసులలో హవళిగి నుంచి ఉరవకొండకు ఉచితంగా బస్సులోకి ఎక్కించుకునేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న తాము అందుబాటులో ఉంటానని, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,స్థానిక టీడీపీ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

మంట రా'జేసి'న మాటలు

పోలీసు అమరవీరులదినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పోలీసు అమరవీరు దినోత్సవం నాడు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి ఎఎస్పీపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారవే రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను వైసిపి నాయకులతోపాటు, జిల్లా పోలీసు అధికారుల సంఘం కూడా తప్పుబట్టింది. పోలీసు ఉన్నతాధికారిని కించపరిచే విధంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారుల స్పందనేదీ : అనంత వెంకటరామిరెడ్డి , వైసిపి జిల్లా అధ్యక్షులు

ఐపిఎస్ అధికారిని కించపరిచే విధంగా మాట్లాడుతున్నా ఉన్నతాధికారులు స్పందించారా అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. ఐపిఎస్ అధికారుల పట్లనే ఆ రకంగా మాట్లాడుతున్నా పట్టించుకోకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఐపిఎస్ అధికారి ఇంట్లోకే వస్తామంటూ బెదిరిస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

జెసి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : సాకే త్రిలోక్ జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు

ఎఎస్పీ రోహిత్ కుమార్ నిజాయితీగా పనిచేస్తున్న ఐపిఎస్ అధికారి అని జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్ తెలిపారు. ఆయన పట్ల తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారిని కించపరిచే విధంగా మాట్లాడటం సరైంది కాదని అన్నారు. నిజంగానే ఏమైనా సమస్య ఉంటే దాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. అలా కాకుండా అధికారినే కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. వారి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసే విధమైన వ్యాఖ్యలు సరైనవి కాదని పేర్కొన్నారు.

గతంలోనూ పోలీసు అధికారులపై ఇదే తీరు

గతంలో జెసి. ప్రభాకర్‌రెడ్డి పోలీసు అధికారుల పట్ల ఇదే రకంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అంతకు మునుపు అధికారంలో ఉండగా జెసి.దివాకర్‌రెడ్డి పోలీసులపై ఇదే రకమైన వ్యాఖ్యలు చేయడం, దానికి వ్యతిరేకంగా అప్పటి పోలీసు సంఘం అధికారిగానున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ మీసం తిప్పి సవాల్ చేయడం చర్చనీయాంశమైంది. ఆ తరువాత గడిచిన ఐదేళ్లలో తాడిపత్రి డీఎస్పీ చైతన్యపై పలుమార్లు ఆరోపణలు చేశారు. ఆయనతో బహిరంగంగానే మాటల యుద్ధం నడించింది. ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చాక అనేక మంది డీఎస్పీలు మారారు. తాజాగా ప్రభుత్వం ఐపిఎస్ అధికారిని అక్కడ నియమించింది. ఆయన ఇటీవలనే కొంత మందిపై కేసులు నమోదు చేసి గట్టి హెచ్చరికలు చేశారు. ఈ నేపథ్యంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మరోమారు వివాదంగా మారింది.

ఏఎస్పీపై జేసీ వ్యాఖ్యలు దుమారం
తప్పుబట్టిన పోలీసు అధికారుల సంఘం

జేసీపై చట్టపరమైన చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి - గుత్తి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ చౌదరి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. బుధవారం గుత్తి పోలీస్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా,నిర్భయంగా తమ విధులను నిర్వహించాలని చెప్పారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం క్రైమ్ రేట్ తగ్గిందన్నారు.గుత్తిలో పోలీస్ శాఖకు సంబంధించిన స్థలాలను వాణిజ్యపరంగా వినియోగిస్తామన్నారు.ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు, సంబంధిత శాఖలతో సమన్వయంగా తగు చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ రామారావు, ఎస్ఐలు కె.సురేష్, నాగప్ప, ఎఎస్ఐలు నాగ మాణిక్యం రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

పంట కోత సమయంలో వర్షం

సోయా చిక్కుడు, మొక్కజొన్న పంటలకు నష్టం

ప్రజాశక్తి-యల్లనూరు

మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో మొక్కజొన్న, సోయా చిక్కుడు పంటలు దెబ్బదింటున్నాయి. పంట చేతికి వచ్చిందనుకున్న సమయంలో వర్షాలు ప్రారంభం కావడంతో రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. ముఖ్యంగా సోయా చిక్కుడు పంట కోత కోసి ఓదెలపై ఆరబెట్టారు. ప్రస్తుతం మిషన్‌కు వేసే సమయంలో వర్షం కురవడంతో పొలాల్లోనే తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్లు అయ్యే పంట చేతికి రాకపోయేసరికి దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన పడుతున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షానికి తడిసిన సోయా చిక్కుడు పంట

90 శాతం సబ్సిడీతో విత్తన పప్పుశనగ పంపిణీ చేయాలి

జెడిఎ కార్యాలయం ఎదుట ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని రైతులకు 90 శాతం సబ్సిడితో పప్పు శనగ విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడి కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం రబీలో అతివృష్టి అనావృష్టి కారణంగా సాగు చేసిన పంటలను రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాక పోవడంతో రైతులు అప్పులో కూరుకుపోయారన్నారు. ప్రభుత్వం 2026 రబీలో పప్పు శనగ 25 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. అనేక ఏళ్లగా ఇస్తున్న 40 శాతం సబ్సిడీని 25 శాతానికి తగ్గించడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. పప్పు శనగ బయట మార్కెట్‌లో రూ.5800 నుంచి రూ.6 వేల వరకు ఉందన్నారు. కానీ ప్రభుత్వం రూ.7800 ధర నిర్ణయించి 25 శాతం సబ్సిడీ ఇస్తామనడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందన్నారు. రైతులు పంటల సాగు చేయాలంటే ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం సబ్సిడీ సవరించి 90 శాతం సబ్సిడీతో పప్పు శనగ విత్తనాలు ఇవ్వాలన్నారు. రబీకి ముందు వర్షాలు రావడంతో సేద్యాలు చేసుకొని విత్తనం వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సీజన్ ప్రారంభం కావడంతో సబ్సిడీ పప్పుశనగ సకాలంలో ఇస్తారా ఇవ్వరా అని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో పంపిణీ చేసిన ఏజెన్సీలకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో పప్పు శనగ విత్తన పంపిణీ జరుగుతుందో లేదో అన్న అనుమానంలో రైతులున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి విత్తనం పంపిణీ ఏజెన్సీలకు బకాయి ఉన్న డబ్బులు వెంటనే చెల్లించి పప్పుశనగ పంపిణీ సకాలంలో చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరం నష్టపోయిన రైతులకు పంటనష్టపరిహారం ప్రకటించి రైతులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా నాయకులు బిహెచ్ రాయుడు, బి.శివారెడ్డి, చెన్నారెడ్డి, సంజీవరెడ్డి, పోతులయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న నాయకులు

వ్యవసాయ పథకాలపై శిక్షణ ఇవ్వండి..

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ అనుబంధ రంగాల్లో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలపై రైతులకు విస్తృతంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన అనుబంధ శాఖల అధికారులు వీలైనంతవరకు ఆత్మ అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను మరింత పెంచాలని, రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలను చేరవేసేందుకు అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఇందులో రైతులకు కలిగే సందేహాలను నివృత్తి చేయడం, నూతన సాంకేతికతను ఆయా శాఖల అధికారులు తెలియజేయాలన్నారు. శిక్షణ కార్యక్రమాలకు ఆత్మ పీడీ నోడల్ అధికారిగా ఉండాలని, ఆయా శాఖల అధికారులతో మానిటర్ చేస్తూ షెడ్యూల్‌ని ప్రాపర్‌గా సిద్ధం చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పట్టుపరిశ్రమ, ఫిషరీస్ లాంటి అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు. శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వాటి ఫీడ్‌బ్యాక్, ఫోటోలను క్యాప్చర్ చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో ఆయా శాఖల నుంచి ఒక్కో అధికారిని నియమించాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమాలను కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలన్నారు. యూరియా పంపిణీకి సంబంధించి అవసరం ఉన్న చోట సరఫరా చేసి పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతానికి యూరియా నిల్వలకు ఇబ్బంది లేదని, రాబోయే కాలంలో ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రతిరోజు మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. ఎక్కడైనా సమస్య ఉందని అనిపిస్తే ముందుగానే తెలియజేయాలన్నారు. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమంలో కొన్ని కంపెనీలు ఎంఓయులు చేసుకోవడం జరిగిందని, ఆయా కంపెనీలతో నెలకు ఒకసారి మాట్లాడాలన్నారు. ఎంఓయుల మేరకు కంపెనీలు పని చేసేలా చూడాలని, ఆయా కంపెనీలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని తెలియజేయాలన్నారు. నేషనల్ బ్యాంబో మిషన్ లక్ష్యాలు చేరుకునేందుకు దృష్టి సారించాలన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా చీని పంటలో నూతన వంగడాల సాగును ప్రోత్సహించాలన్నారు. పిఎంఎఫ్ఎంఈ / ఏపిఎఫ్‌పిఎస్ పథకం కింద మంజూరైన యూనిట్లకు సంబంధించి త్వరితగతిన గ్రౌండ్ చేసేలా ఆయా శాఖల అధికారులు పని చేయాలని, మంచి నాణ్యమైన ప్రతిపాదనలను పంపించాలన్నారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ ఆర్టికల్చర్ (ఎంఐడిహెచ్) కింద పెండింగ్ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పశుకిషాన్ క్రెడిట్ కార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా పారదర్శకంగా అందజేయాలన్నారు. క్యాంపెయిన్ మోడ్‌లో క్యాంపులను నిర్వహించి వంద శాతం పూర్తి చేయాలన్నారు. లైవ్ స్టాక్ యూనిట్లకు సంబంధించి గ్రౌండింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, మార్కెటింగ్ ఎడి రాఘవేంద్రకుమార్, డిసిఒ అరుణకుమారి, ఆత్మా పీడీ పద్మలత, ఫిషరీష్ డిడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్‌డిఎం నరేష్‌రెడ్డి, నాబార్డ్ ఎజిఎం అనురాధ, జడ్పీ సీఈవో శివశంకర్, డిఆర్‌డిఎ పీడీ శైలజ, కెవికె శాస్త్రవేత్త మల్లేశ్వరి, పశుసంవర్ధక శాఖ జెడి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

మున్సిపల్ అనుబంధ శాఖల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు వాటి అనుబంధ శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమత్ ప్రాజెక్టు అమలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని మున్సిపాలిటీలలో ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు, అన్న క్యాంటీన్ల నిర్వహణ, టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలు, మెప్మా పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. అమత్ పథకంలో భాగంగా త్రాగునీటి సరఫరా సక్రమంగా జరగాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులను మెరుగు పరచుకోవాలన్నారు. తాడిపత్రిలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులను పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ అధికారులు సమన్వయంతో రెండు నెలల లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుత్తిలో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు. అనంతపురం ప్రభుత్వ ప్రధాన సర్వజన ఆస్పత్రిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనికమిషనర్‌ను ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యంలో తృప్తి క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజన వసతి కల్పించే విధంగా క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిల్పారామంలో ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గదులను ఆసక్తి ఉన్న సహాయక బృందాలకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తాగునీటి సరఫరా పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం తాడిపత్రి మున్సిపాలిటీకి సంబంధించి ఇదివరకే వినియోగించకుండా మిగిలిపోయిన సోలార్ ప్రాజెక్టుకు నిర్వహణకు బిఆర్‌జిఎఫ్ నిధులు రూ.88 లక్షలను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్‌డిఎం ఎ.నాగరాజు, అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్లు బాలస్వామి, శివరామకృష్ణ, వంశీకృష్ణ భార్గవ్, రాయదుర్గం దివాకర్‌రెడ్డి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, టిఇలు వాసుదేవరెడ్డి, భవాని, అర్షద్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో అగ్నిప్రమాదం..

విలువైన సామగ్రి బుగ్గిపాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని కిష్టిపాడు ప్రభుత్వ పశు వైద్యశాలలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని విలువైన వస్తుసామాగ్రితోపాటు పశువుల దాణా, మందులు బుగ్గిపాలై ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామానికి చివర ఉన్న ప్రభుత్వ వైద్యశాలలో తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించడంతో అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పశువైద్యసిబ్బంది, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే స్థానికులు కొందరు హడావుడిగా అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోయింది. ఆసుపత్రిలో ఉన్న మందులు, దాణా, విలువైన వస్తు సామగ్రి దగ్ధమైంది. అగ్నిప్రమాదం ఎలా జరిగిందని స్థానికులు, వైద్యసిబ్బంది, పోలీసులు ఆరాతీస్తున్నారు. ఈప్రమాదంలో సుమారు రూ.4లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు డాక్టర్ భారతి, కనులము తెలిపారు. ఈమేరకు పశువైద్యురాలు కమలమ్మ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో శిక్షణ ఎస్ఐ చంద్రశేఖరరెడ్డి, జమేదారు రామకృష్ణ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసునమోదు చేశారు.

మంటల్లో తగులబడుతున్న పశువైద్యశాల

దోచుకుందాం..దాచుకుందాం..

బినామీ పేర్లతో మస్టర్లు-'ఉపాధి' సిబ్బంది చేతివాటం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని ఉపాధి సిబ్బంది వ్యవహార శైలి 'దోచుకుందాం.. దాచుకుందాం..' అన్న చందంగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నారు. అధికారుల పరిరక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా బినామీ పేర్లతో మస్టర్లు రాసుకుని జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. పని ప్రదేశాల్లో పదిమంది కూలీలు ఉంటే అదనంగా పేర్లు ఎక్కించుకుంటున్నట్లు తెలుస్తోంది. మండలంలోని కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై ఈ వ్యవహారం నడుపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఉపాధి హామీ పథకంలో ఉన్నతాధికారులు వారానికి రెండుసార్లు మస్టర్ వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. అయితే అధికారులు వెరిఫికేషన్ లేకపోవడంతో మండలంలోని సనప, మదిగుబ్బ, వేపచెర్ల, ముట్టాల, ఆత్మకూరు పంచాయతీలు తప్ప మిగతా పంచాయతీల్లో ఇష్టానుసారంగా బినామీ పేర్లు రాసుకుంటున్నట్లు సమాచారం. కొంతమంది టెక్నికల్ అసిస్టెంట్లు అధికారులు ఎవరొచ్చినా తామే చూసుకుంటామని ఫీల్డ్ అసిస్టెంట్లకు భరోసా ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎంపిడిఒను వివరణ కోరగా మండలంలోని ఎపిఒను అడగాలని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడుతున్న ఉపాధి హామీ సిబ్బందిపై చర్యలు తీసుకుని నకలీ పేర్లతో మస్టర్లను అరికట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (పాతచిత్రం)

క్షవర వృత్తిదారుల దీక్షలకు సంఘీభావం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు నైరుతీరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ పట్టణ క్షవర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరహార దీక్షలకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, వైసిపి నేతలు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా ఉపాధ్యక్షు రాలు నైరుతీరెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి సురేష్ మాట్లాడుతూ పట్టణంలో క్షవర వృత్తిదారుల ఉపాధికి గండిపడే విధంగా కార్పొరేట్ సెలూన్ షాపులను ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. ఆ సెలూన్ షాపును ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ స్వామి వెళ్లి ప్రారంభించడం శోచనీయమన్నారు. స్థానిక క్షవర వృత్తిదారులు కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని గత 45 రోజులుగా అనేక విధాలుగా ఆందోళనలు చేసినా ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. క్షవర వృత్తిదారుల సమస్య పరిష్కారం అయ్యేవరకు వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీక్షల్లో క్షవర వృత్తిదారులు గోవిందు, నరేష్, శ్రీనివాసులు, సోమశేఖర్, వీరేష్, రాజు, రంగా, సురేష్, తదితరులు కూర్చొన్నారు. కార్యక్రమంలో క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు బెలగంటి లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు అబ్దుల్ భాషిద్, నూర్‌నిజామీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు (సిఐటియు అనుబంధ) బుధవారం స్థానిక ఆలూరు రోడ్డులోని విద్యుత్ శాఖ డిఎఇ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్య పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం, ఉద్యోగుల సంఘాలతో చర్చలు జరిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పరిష్కరించిన పాపానపోలేదన్నారు. ఉద్యోగులకు దీపావళి బొనాంజా అంటూ హడావుడి చేసి కనీసం ఇవ్వాల్సిన డిఎ బకాయిలు, ఇతర బకాయిలు ఇవ్వకుండానే కేవలం ఒక డిఎతోనే సరిపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 జూలై నాటికి ఇవ్వాల్సిన నాలుగు డిఎ బకాయిలు ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు అనుకూలంగా, కార్మిక, ఉద్యోగ వర్గాలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ ఆఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కెఎం బాషా, సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, కార్మికులు వన్నూరప్ప, నాగరాజు, అనిల్, రాజు, బొగేశ్, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

డిఎఇ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

పారిశుధ్య పనులు పరిశీలన

నీటి తోడివేతను పరిశీలిస్తున్న కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : రోజువారి పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగర కమిషనర్ బాలస్వామి బుధవారం నగరంలోని జీసస్‌నగర్ రోడ్డులో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. తర్వాత సూర్యానగర్ సర్కిల్ రోడ్డుపై ఆగి ఉన్న వర్షం నీటిని సక్షన్ మిషన్ ద్వారా తొలగించే పనులను పర్యవేక్షించారు. ఇదేవిధంగా నగరంలో ఎక్కడ వర్షం నీరు ఆగి ఉన్నా తొలగించాలని ఇంజినీరింగ్ కార్మికులను ఆదేశించారు. అక్కడి నుంచి నగరంలోని ప్రధాన రహదారుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించడంతోపాటు జూనియర్ కళాశాల రోడ్డులో ఉన్న అన్నక్యాంటీన్‌ను సందర్శించి అల్పాహార నాణ్యతను పరిశీలించారు.

మెప్మా టిపిఒకు సన్మానం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం నగరపాలక సంస్థ టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసరుగా బాధ్యతలు స్వీకరించిన నాగ సుబ్బరాయుడును వార్డు సంక్షేమ, అభివృద్ధి కార్యదర్శులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సర్వీస్ రిజిస్టర్‌లో అప్డేట్, సీఎల్‌లు, ఇఎల్ గురించి ప్రస్తావించగా సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం జెఎసి నాయకులు డి.సుధాకర్, వి.లక్ష్మీనారాయణ, ఎంకె వరప్రసాద్, సీరాల చంద్ర, మల్లికార్జున, శివశంకర్, రామకృష్ణ, కిషోర్, విమల, మహేష్‌నాయక్, రాఘవేంద్ర, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిపిఒను సన్మానిస్తున్న సిబ్బంది

గ్యాంగ్‌వార్ కాదు.. మామా అల్లుళ్ల గొడవ : డీఎస్పీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గుత్తి రోడ్డులో జరిగిన గ్యాంగ్‌వార్ కాదని, మామా అల్లుళ్ల మధ్య జరిగిందని డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు అన్నారు బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వతేదీన గుత్తి రోడ్డులోని నయారా పెట్రోలు బంకు దగ్గర జరిగిన గొడవ గ్యాంగ్‌వార్‌గా సోషల్ మీడియాలై వైరల్ అయిందన్నారు. అందులో వాస్తవం లేదన్నారు. గొడవలో గాయపడిన మహేష్, తాటికొండ నాగరాజు మామ అల్లుళ్లు అన్నారు. వీరిద్దరికీ బుక్కరాయసముద్ర బిజెపి కొట్టాలలో స్థల విషయంలో ఉన్న మనస్పర్థలతో గొడవ పడ్డారన్నారు. ఈ విషయంలో ఇద్దరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి ఈనెల 21వతేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం గుత్తిలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో అనంత మాట్లాడుతూ తాడిపత్రి ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరిపై మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. అమరవీరుల దినోత్సవం రోజే పోలీసుల సమక్షంలోనే 'రేయ్ ఏఎస్పీ..' అని సంబోధించడం చూస్తుంటే ఈ ప్రభుత్వంలో సామాన్యులకే కాదు.. చివరకు ఐపిఎస్‌లకూ రక్షణ లేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. 24 గంటలు గడిచినా డీజీపీ, డీఐజీ, ఎస్పీ స్పందించలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. సాక్షాత్తూ ఏఎస్పీకే గతిలేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 నెలలుగా అరాచక పాలన సాగుతోందన్నారు. ఎక్కడ చూసినా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. భూ కబ్జాలు, కల్తీ మద్యం విక్రయాలు ఎటు చూసినా పేకాట క్లబ్బులు నడుస్తున్నాయన్నారు. పిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు.గుంతకల్లు ఎమ్మెల్యే జర్నలిస్టులను కూడా బెదిరించే స్థాయికి వచ్చారన్నారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, నాయకులు డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, సివి.రంగారెడ్డి, మల్లయ్యయాదవ్, మైనుద్దీన్, గురుప్రసాద్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, ఎ.దస్తగిరి, ఎం.రంగస్వామి, బి.రమేష్‌రెడ్డి, సి.రాధాయాదవ్, డాక్టర్ ఎం.శాంతిప్రియ, హేమలతారెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, న్యాయవాది నూర్ మహమ్మద్, ఎ.సూర్యనారాయణరెడ్డి, నూర్‌నాయక్, కౌన్సిలర్లు వి.వరద, వాల్మీకి శివ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నార్పల : మండల పరిధిలోని రంగాపురం పంచాయతీ మూగే తిమ్మంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామంలో నీటిఎద్దడి నెలకొందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో సర్పంచు కుళ్లాయప్పతో కలిసి అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రెండు బోర్లు ఉండగా వారంరోజుల క్రితం ఓ బోరు మోటార్ కాలిపోయిందన్నారు. దీంతో ఒక మోటారు నుంచి వస్తున్న నీరు సరిపోవడం లేదన్నారు. రెండు, మూడు రోజుల్లో మోటార్‌కు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి కీర్తన, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

28, 29న సర్పంచులకు శిక్షణ

శింగనమల : ఆర్‌జిఎస్‌ఎ కార్యాచరణ ప్రణాళిక, 2025-26 పంచాయతీరాజ్ శాఖలోని సిబ్బంది, గ్రామ పంచాయతీ సర్పంచులకు ఆదాయ వనరులపై ఈనెల 28, 29వతేదీల్లో మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'విజన్' విద్యార్థి

యాడికి : మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్ విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు విజన్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన డివిజినల్ స్థాయి జట్ల మధ్య జరిగిన వాలీబాల్ పోటీల్లో గుంతకల్లు డివిజన్ తరపున యాడికి విజన్ హైస్కూల్ విద్యార్థి తృషిత అద్భుతం ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థిని ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకూ పశ్చిమ గోదావరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు తరుపున పాల్గొననున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.678/2023 in O.S.No.380/2023
Between:
ఎన్.ప్రవీణ్ కుమార్ రెడ్డి ...వాది
మరియు
కొరివి ప్రతాప్ మరియు ఇతరులు ...ప్రతివాదులు
To,
కొరివి ప్రతాప్ తండ్రి కె.జయరాజు [R1]
Residing at ఆలూరు గ్రామం, తాడిపత్రి మండలం, అనంతపురము జిల్లా,
ప్రతి వాదులకు దావా సమను
పై దావాను మీరు వాది తన ఆస్తిలోనికి వెళ్ళకుండా వుండు నిమిత్తము మీ మీద దావా దాఖలు చేసియున్నారు. పై దావా మీ హాజరు నిమిత్తము వాయిదా 11-11-2025 వ తేదిన వేయబడినది.కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలెను.లేని యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానము చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా :11/11/2025
S.CHANDRA SEKHAR REDDY
N.U.DEVANATHA REDDY,
వాదితరుపు వకీళ్ళు, తాడిపత్రి.
సెల్ నెం.8919016750.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.380/2023
Between:
ఎన్.ప్రవీణ్ కుమార్ రెడ్డి ...వాది
మరియు
కొరివి ప్రతాప్ మరియు ఇతరులు ...ప్రతివాదులు
To,
కొరివి ప్రతాప్ తండ్రి కె.జయరాజు [D1]
Residing at ఆలూరు గ్రామం, తాడిపత్రి మండలం, అనంతపురము జిల్లా,
ప్రతి వాదులకు దావా సమను
పై దావాను మీరు వాది తన ఆస్తిలోనికి వెళ్ళకుండా వుండు నిమిత్తము మీ మీద దావా దాఖలు చేసియున్నారు. పై దావా మీ హాజరు నిమిత్తము వాయిదా 11-11-2025 వ తేదిన వేయబడినది.కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదిన ఉదయం 10-30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలెను.లేని యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానము చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా :11/11/2025
S.CHANDRA SEKHAR REDDY
N.U.DEVANATHA REDDY,
వాదితరుపు వకీళ్ళు, తాడిపత్రి.
సెల్ నెం.8919016750.

IN THE COURT OF THE SPECIAL MAGISTRATE-I,ANANTAPURAMU
M.C.No. 26/2024
Between:
Mesa Radhika & another ...Petitoners
And
Mesa Purushotham Raju ...Respondent
NOTICE TO THE RESPONDENT
TO,
Mesa Purushotham Raju S/o Ramanjula Naidu, Private employee, D.NO.1-259, Vadala Swamy Street, Mudigubba Village and Post, Sri Sathya Sai District. Working as Supervisor Perfetti Van Melle India Pvt. Ltd. 301, 3rd Floor, Krishna Chambers, 20/21, V Cross, Konena agrahara, Airport Road, Banglore-560017 Karnataka.
ఇందుమూలముగా ప్రతివాది అయిన మీకు తెలియజేయడం ఏమనగా, వాది అయిన మీ భార్య మరియు మీ కుమార్తె తమకు మెయింటెనెన్సు /భరణం చెల్లించమని కోరుతూ పై కోర్టులో అర్జీ దాఖలు చేసి వున్నారు. కోర్టు వారు మీ హాజరుకు గాను కేసును 30/10/2025వ తేదికి వాయిదా వేసి వున్నారు. ఆ రోజున ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరాలు దాఖలు చేసుకోవలెను. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వాయిదా తేదీ : 30/10/2025
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎం.మురళి మోహన్,
వాదితరుపు న్యాయవాది

CHANGE OF NAME
I, **BAKE MAHAMUDA** (Old Name) W/o **BAKE SADIQ** VALI residing at # 10-78, Brundavan Colony, Prasannayapalli Panchayath, J.N.T.U Anantapur (Post)-515002, Rapthadu (Mandal), Anantapur (Dist.) Changing my name from **BAKE MAHAMUDA to BAKE MAHAMUDA BEGUM** (New Name). Hence for, I am being called as **BAKE MAHAMUDA BEGUM** for all purposes.

CHANGE OF NAME
I, BAKE GOUSIYA (Old Name) W/o **BAKE SHABEER BASHA** residing at # 10-78, Brundavan Colony, Prasannayapalli Panchayath, J.N.T.U Anantapur (Post)-515002, Rapthadu (Mandal), Anantapur (Dist.) Changing my name from **BAKE GOUSIYA to BAKE GOUSIA BEGUM** (New Name). Hence for, I am being called as **BAKE GOUSIA BEGUM** for all purposes.

జగన్‌ను కలిసిన యల్లనూరు వైసిపి నాయకులు

జగన్‌ను కలిసిన ముఖ్య నేతలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలోని వైసిపి ముఖ్య నేతలు నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ సమక్షంలో అధినేత వైఎస్ జగన్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి పార్టీ వ్యవహారాలపై చర్చించారు. జగన్‌ను కలిసిన వారిలో పార్టీ వ్యవహారాల సభ్యులు ఆలూరు సాంబ శివారెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భోగాతి నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు, జెడ్పిటిసి భోగాతి విజయ్‌ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

శింగనమల : వైసిపి నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వైసిపి నాయకులు బుధవారం అధినేత జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు బొకే అందించారు.

'కాళ్లు విరగ్గొడతాం..' అంటే కూర్చోవాలా..?

తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్లు

ప్రజాశక్తి-తాడిపత్రి

'ఐపిఎస్ అని కాళ్లు విరగ్గొడతాం.. గన్నుతో కాలుస్తాం..' అంటే గాజులు తొడుక్కుని కూర్చోవాలా..? అంటూ తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని జెసి నివాసంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాము పోలీసులతో కొట్టించుకుని, అక్రమ కేసులు పెట్టించుకుని జైలు పాలయ్యామన్నారు. అయితే తాము అధికారంలోకి వచ్చినా ఇవన్నీ భరించాలా? అంటూ నిలదీశారు. అయినా ఎఎస్‌పి ఇష్టం వచ్చినట్టు అక్రమ కేసులు పెడుతుంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. యాడికి మండలం వెంకన్నపల్లి గ్రామంలో టిడిపి కార్యకర్తలపై వైసిపి కార్యకర్తలు వేట కొడవళ్లతో దాడి చేస్తే కనీసం అరెస్టు చేయలేదన్నారు. 10 రోజుల తర్వాత కేసు నమోదు చేయించారన్నారు. ఇప్పుడు వచ్చి నీతులు చెబుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి గత మీ ప్రభుత్వంలో తమపై ఇష్టానుసారంగా వ్యవహరించినప్పుడు ఎక్కడున్నావని ప్రశ్నించారు. ఇదే తాడిపత్రిలో అప్పటి డీఎస్పీ చైతన్య ఇష్టారాజ్యంగా చేసినప్పుడు నీకు కనపడలేదా? అన్నారు. ఆఖరికి మహిళా కౌన్సిల్ సభ్యులపై 307 కేసులు కట్టినప్పుడు, దాడులు చేసినప్పుడు ఒక్కరోజైనా ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడలేదే.. నీకు పెద్దారెడ్డి అంటే భయమా.. అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలు కఠినంగా ఉన్నాయి కాబట్టే మీరు ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఇలాగే మాట్లాడితే ఏదో రోజు మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ఇక సాకే త్రిలోకనాథ్ అసలు మీ పోలీస్ అధికార సంఘం అనేది రిజిస్ట్రేషన్ ఉందా..? అన్నారు. 30ఏళ్లుగా నువ్వు అనంతపురంలో పని చేస్తూ ఒక్కరోజైనా యూనిఫాం వేసి విధులకు హాజరయ్యావా.. అని నిలదీశారు. గత ప్రభుత్వంలో ప్రకాష్ అనే ఎఆర్ కానిస్టేబుల్ పోలీసులకు సంబంధించి టిఎ, డిఎల గురించి అడిగినందుకు సస్పెండ్ చేస్తే పోలీస్ అధికార సంఘం ఏమైందని ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

రాయదుర్గం : పట్టణంలోని శనిమహాత్ముని ఆలయం సమీపంలో విద్యుత్ సరఫరా అంతరాయం, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని స్థానిక మహిళలు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి, విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఇందుకు స్పందించిన విప్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

బాల్య వివాహంపై అవగాహన

యల్లనూరు : మండల కేంద్రంలో త్వరలో జరగనున్న ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలో 8వ తరగతి చదువుతున్న ఓ బాలికకు వచ్చేనెల 25, 26వతేదీల్లో వివాహం చేయాలని పెద్దలు నిశ్చయించారు. ఈనేపథ్యంలో బాలికకు ఇష్టం లేని వివాహం చేస్తున్నట్లు చైల్డ్ హెల్ప్ కేర్ సెంటర్ 1098 సమాచారం అందింది. దీంతో చైల్డ్ హెల్ప్ కేర్ సెంటర్ కౌన్సిలర్ సురేష్‌కుమార్ వెంటనే స్థానిక ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజమణితో ఆరాతీశారు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులకు ఎస్ఐ రామాంజనేయరెడ్డి, తహశీల్దార్ రాము కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం చైల్డ్‌హెల్ప్ కేర్ కౌన్సిలర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహలు చేస్తున్నట్లు తెలిస్తే 1098కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌కేర్ సెంటర్, ఐసిడిఎస్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలను విజయవంతం చేద్దాం

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ పరిధిలోని విద్యార్థులకు నిర్వహించనున్న ఆటల పోటీలను విజయవంతం చేద్దామని ఎంఇఒ మల్లికార్జున పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాలట్లాడుతూ 14 నుంచి 17ఏళ్లలోపు బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. కావున ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీడీలు వారి పరిధిలోని విద్యార్థులకు రోజూ సాయంకాలం ఆయా క్రీడల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని రేకులకుంట ఎంపిపి స్కూల్‌ను ట్రైనీ కలెక్టర్ సచిన్‌రావత్‌శర్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం ఆరగించారు. తర్వాత ఈవిద్యా సంవత్సరం జరిగిన ప్రవేశాలు, మధ్యాహ్నం భోజనం, హాజరు వివరాలు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎర్రిస్వామిరెడ్డి, ఎంఇఒలు మహమ్మద్ ఇర్షాద్, వెంకటరమేష్, పాఠశాల కమిటీ ఛైర్మన్ వీరేష్, ఉపాధ్యాయులు హరినాథ్, శివశంకర్, జయకృష్ణ పాల్గొన్నారు.

రేకులకుంట పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సచిన్ రావత్ శర్మ

బొమ్మనహాల్ : మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలను ట్రైనీ కలెక్టర్ సచిన్ రావత్‌శర్మ బుధవారం ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించారు. తర్వాత పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లను తనిఖీ చేసి ప్రధానోపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

అనారోగ్యంతో ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స చేయించుకున్న పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను విప్ కాలవ శ్రీనివాసులు పట్టణంలోని స్వగృహంలో పంపిణీ చేశారు. కణేకల్‌కు చెందిన ఫక్రుమబీకి రూ.2,12,213, పద్మావతికి రూ.20వేలు, కదరంపల్లికి చెందిన తగ్గుపర్తి భానుకు రూ.2 లక్షల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుంటోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆపరేషన్లు చేయించుకున్నవారు అవసరమైన బిల్లులు సకాలంలో సమర్పిస్తే ఆర్థికసాయం అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రాయదుర్గం టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, కదరంపల్లి సోము, తదితరులు పాల్గొన్నారు.

పాపంపేట ప్రజలకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-అనంతపురం

రూరల్ పరిధిలోని పాపంపేట ప్రజలకు భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు వందల ఎకరాలు స్త్రోత్రీయ భూములు తమవంటూ దాదాపు ఐదారు వేల కుటుంబాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వారందరికీ ప్రభుత్వం అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు నాయకులు నారాయణరెడ్డి, జడ్పిటిసి చంద్ర పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఇందులో భాగంగా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా 2023-25 మధ్య ఆర్‌సిహెచ్ రికార్డులు, గర్భిణులు, చిన్నపిల్లలకు సంబంధించిన ఎంసిహెచ్ కార్డులు పరిశీలించి సిబ్బందితో ఆరాతీశారు. అలాగే నేషనల్ హెల్త్ మిషన్, జిల్లా కోఆర్డినేటర్ కిషోర్ ఆధ్వర్యంలో మండలంలోని భైరసముద్రం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అఫ్తాబ్, జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డిపిహెచ్.ఎన్ హేమలత, జరీనా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణి ఎస్తేర్, సూపర్ వైజర్ రామలక్ష్మమ్మ, ఫార్మాసిస్ట్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, ఎంఎల్‌హెచ్‌పీలు షైనీ, సాయి మౌనిక, నాగమణి, సల్మా, దీప్తి, సువర్ణ, ఏఎన్‌ఎంలు సన్న లింగమ్మ, వరలక్ష్మి, సావిత్రి, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు సునీత, ఈశ్వరమ్మ, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతుసంఘం నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం

కూడేరు మండల కేంద్రంలో నిర్వహించిన రైతుసంఘం మండల మహాసభలో మంగళవారం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ముందుగా మహాసభకు ముఖ్య అతిథులుగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి హాజరై రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వెంకటేష్, కార్యదర్శిగా ఈరప్ప, మండల ఉపాధ్యక్షులుగా రాజు, రామన్న, పెద్దన్న, సహాయ కార్యదర్శులు కాశీం, హుస్సేన్‌సాబ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

పాత పద్ధతిలోనే తరగతులు నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

అనంతపురం : ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పాత సమయ పద్ధతిలోనే తరగతులు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరుణ్ రషీద్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చాలామంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కళాశాలకు వస్తుండటంతో వారందరికీ సరైన బస్సు సౌకర్యం లేక సతమతమవుతున్నారన్నారు. కావున జూనియర్ కళాశాల సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఒక్క జూనియర్ కళాశాలలో పీడీ, పిఇటి పోస్టులను భర్తీ చేయాలన్నారు.

చెరువులను నీటితో నింపాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులతోపాటు యల్లనూరు మండలంలోని బొప్పేపల్లి చెరువును హెచ్చెల్సీ నీటితో నింపాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. ఈమేరకు బుధవారం అనంతపురంలోని హెచ్చెల్సీ ఎస్‌ఇ కార్యాలయంలో ఎస్‌ఇని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలో వర్షాలు లేక బోర్లన్నీ అడుగంటిపోయాయన్నారు. కావున హెచ్చెల్సీ నీటితో ఆయా చెరువులను నింపితే తాగునీటి సమస్యతోపాటు భూగర్భజలాలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎల్‌కె చెన్నారెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, భయపరెడ్డి, శివనారాయణరెడ్డి, వెంకటరాముడు, రైతులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ ఎస్ఇకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అమరవీరుల దినోత్సవం

యల్లనూరు : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఎస్ఐ రామాంజనేయరెడ్డి బుధవారం స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో అమరవీరుల త్యాగ ఫలితాలు, పిల్లల సంరక్షణ, వారి ధైర్య సాహసాలు, తదితర అంశాలపై అవగాహనా కల్పించారు. ముఖ్యంగా సైబర్‌నేరాలు, పిల్లలపై తల్లిదండ్రులు ప్రేమ, ఆదర అభిమానాలు, బాల్య వివాహలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జెమిందార్లు, పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుడు అరెస్టు

హత్య కేసు అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సిఐ వెంకటరమణ

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలం మురడి గ్రామంలో నాగమణి హత్య కేసులో నిందితుడు భర్త హనుమంతు రాయుడును బుధవారం అరెస్టు చేసినట్లు రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హనుమంతురాయుడు తాగుడుకు బానిసై ఎలాంటి పనిచేయకుండా డబ్బుల కోసం భార్యని వేధించేవాడు. ఈనేపథ్యంలోనే ఈనెల 20వతేదీన సోమవారం తెల్లవారుజామున నాగమణి తన పిల్లలతో కలిసి ఇంటి బయట పడుకుని ఉండగా హనుమంతురాయుడు గొడ్డలితో భార్య తల నరికి పరారయ్యాడు. ఘటనపై నాగమణి సోదరుడు రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన బోయ పూలకుంట శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని హీరేహాళ్ మండలం కళ్యం బస్టాప్ వద్ద అదుపులో తీసుకుని విచారించినట్లు చెప్పారు. తన భార్యపై అనుమానంతో గొడ్డలితో నరికి చంపినట్లు ఒప్పుకున్నాడన్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకుని హనుమంతురాయుడును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. 24 గంటల్లోగా నిందితుని అరెస్టు చేసినందుకు రాయదుర్గం రూరల్ సిఐ వెంకటరమణ, డి.హీరేహాల్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డిని ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు అభినందించారు. ఈ సమావేశంలో డి.హీరేహాల్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటజూదరుల అరెస్టు

తాడిపత్రి : పట్టణంలోని టైలర్స్ కాలనీలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.16300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ ఆరోహణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రిలోని టైలర్స్‌కాలనీ, వివేకానంద్ స్కూల్ వద్ద పేకాట ఆడుతున్నట్లు పక్కాగా సమాచారం రావడంతో దాడి చేసి వడిపిల రాజు, పోతిరెడ్డి, చదళ్ల మనోజ్‌రెడ్డి, సాముల గోపాల్‌రెడ్డి, లక్ష్మీనరసింహ, వజ్రా లోకేశ్వర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.16,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.